## ప్రతిధ్వని

# మరుగు

మరుగేలరా.... అనే పాట బావుంటుంది. ఆ సందర్భానికి ఆ పాట సరిపోతుంది.

కానీ, చాలామంది మరుగేదిరా.... అని విలపించే దుస్థితి మన దేశంలో ఉంది.

'మరుగు' ఉండాలని చాలామంది కోరుకుంటారు కుటుంబ సమేతంగా ఏదన్నా హోటల్‌కు వెళ్తే ఫేమిలీ రూమ్‌కోసం చూస్తాం. అంటే టిఫిన్‌తిని, కాఫీ తాగేవరకు మరుగు ఉండాలని మనం కోరుకుంటున్నాం అన్నమాట.




అలాగే రహస్యంగా చర్చలు జరపడానికి మరుగు ఉండాలని రాజకీయ నాయకులు కోరుకుంటారు. ఒకోసారి అలాంటి రహస్య మంతనాలు మరుగున ఉండక బయటపడి పోతుంటాయి. అవి ఏ అవినీతికి సంబంధించినవో అయితే ఆ రాజకీయ నాయకులు ఒకోసారి మరుగున పడిపోతారు.

ఎక్కువగా కుంభకోణాలు, హత్యలు వంటివి రహస్యంగా జరుగుతుంటాయి. పకడ్బందీగా అలాంటివి చేసిన వాళ్ళు ఎప్పటికీ మరుగున ఉండిపోతారు. కొందరు కొంతకాలం ఉండవచ్చు. ఇంకొందరు బయట పడిపోతారు. ఇటీవల 'హవాలా' బయటపడింది. దాంతో ఎందరో నాయకుల పరువు వీధిన పడింది.

శరీరానికి మరుగు అవసరం. అందుకే రక రకాల బట్టలేసుకుంటాం. ఈమధ్య ఓ ప్రముఖ వస్త్ర వ్యాపార సంస్థపై ఇన్‌కమ్‌టాక్స్ దాడులు జరగడంతో కోట్ల నల్లడబ్బు బయటపడింది. లక్షలు కోట్లూ సంపాదించేవాళ్ళు తమ సంపాదన రహస్యంగా ఉండాలని కోరుకుంటారు. ఆడబ్బును కాపాడుకోడానికి మంచి మరుగు ఉండాలనుకుంటారు. పూర్వం అలాంటి మరుగు లంకెల బిందెల రూపంలోనో, పాతాళ గృహం రూపంలోనో ఉండేది. ఇప్పుడు కూడా వేరే రూపంలో అలాంటి మరుగు ఉంటూనే ఉంటుంది.

బ్యాంకులు కూడా అలాంటి మరుగులే అనుకోవచ్చు. మనం ప్రత్యేకంగా దాచుకోవడానికి అక్కడ లాకర్లు ఉంటాయి. మరింత మంచి మరుగు కావలిస్తే, ఇతర దేశాల్లో కూడా దొరుకుతుంది. అటువంటి గొప్ప మరుగు స్విస్ బ్యాంకు అని మనకు కొందరి అనుభవాలూ, ఉదంతాలూ తెలుపుతూనే ఉన్నాయి. స్విస్ బ్యాంకులో ఫలానా నాయకుడు అన్ని కోట్ల రూపాయలు దాచాడనీ, ఫలానా సూపర్ స్టార్ సోదరుడు ఇన్ని కోట్లు దాచాడనీ మనం పేపర్లలో చదివి ఉన్నాం.

నిజానికి రూపాయి నోట్లను, నాణేలను కూడా మంచి మరుగునే ప్రింటు చేస్తారు. ఆ మరుగే లేకపోతే ప్రభుత్వం రూపాయనోట్లను కట్టుదిట్టంగా చలామణి చేయలేదు. ప్రేమికులు కూడా మరుగు కోసం చూస్తుంటారు. ఆ ప్రేమికులు భార్యా భర్తయ్యాక అప్పుడు కూడా వారికి మరుగు కావాలి. అలాంటి మరుగు దొరికిన వాళ్ళు దాంపత్య సుఖాన్ని స్వేచ్ఛగా అనుభవిస్తారు. కాస్త పెద్ద సంసారం ఉన్న మధ్య తరగతి జీవితాల్లో మరుగు' అతి పెద్ద సమస్య కావడంలో విచిత్రం లేదు.

మందు బాబులూ మరుగు కోరు కుంటారు. అందుకే బార్లు నిషేధం వచ్చేక వాళ్ళకి మరింత మరుగు అవసరమయ్యింది. మరుగున ఉండే కొందరు అక్రమంగా మందు వ్యాపారం చేస్తున్నారు. పాపం పండిన వాళ్ళు బయటపడతారు. దొంగసారా కూడా ఏ మారుమూల ప్రాంతంలోనో మరుగున తయారవుతుంది.

విప్లవకారులు కూడా ఏ అడవుల్లోనో మరుగున ఉండి, తమ కార్యకలాపాలు కొనసాగిస్తారు. అంటే అండర్‌గ్రౌండ్‌లో ఉంటారు. దాన్నే యు.జి. అంటారు.

లంచగొండి తనానికీ మరుగు కావాలి. కొందరు ఉద్యోగులు రకరకాల మరుగులు చూసుకుంటారు. ఒకాఫీసులో ఒకాయన ఎవరైనా ఏదైనా పని మీద వస్తే ఆ పని విలువను బట్టి ఒకటో, రెండో స్పూన్‌లు ఇచ్చేవాడట. వాటిని ఫలానా టీ దుకాణంలో ఇమ్మనేవాడట. అతను వాటిని అక్కడ ఇస్తే, ఒక స్పూన్‌కు వంద చొప్పున టీ దుకాణం వాడు తీసుకునేవాడట. ఆ తర్వాత ఆ డబ్బు ఆ లంచగొండికి చేరుతుంది. అలాగ ఆ లంచగొండి తన అవినీతికి ఓ మరుగు ఏర్పరచుకున్నాడు. అతని పాపం పండిందో లేదో మనకి తెలీదు.

ఇక పేదవాళ్ళు బతుకుల్లో మరుగులేక అనేక విధాలుగా అనేక సమస్యలు వస్తాయి. ఒక తడికో, ఒక గోనెసంచో వాళ్ళకు మరుగు కావచ్చు.అది అచ్చమైన మరుగు కాదని, దాన్నో మరుగుగా భావించి తృప్తి పడటమని వాళ్ళకూ తెలుసు.

మరుగులేనితనం ఎంత దుర్భరమో మన సిరులు పండే పచ్చ పచ్చని పల్లెల్లోని పేద పడుచులకు మాత్రమే బాగా అనుభవం. స్నానం చేయాలంటే ఇబ్బంది. చీరమార్చు కోవాలంటే ఇబ్బంది. కాలకృత్యాలు తీర్చుకోడానికి ఇంకెంతో ఇబ్బంది.

స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్ళయినా అనేక గ్రామాల్లో ఇంకా సరైన పాయిఖానాలు లేవు. అంటే కాలకృత్యాలు తీర్చుకోడానికి కూడా అనేక మందికి మరుగులేదు. ఒకప్పుడు తుప్పలు, డొంకలు కొంతలో కొంత 'మరుగు'గా ఉండేవి. ఇప్పుడు సేద్యానికి అవికూడా తరిగిపోతుండడంతో నిర్మానుష్యంగా ఉండడమే మరుగుగా చూసుకునే పరిస్థితి ఎందరికో దాపురించింది.

మనం బస్సుల్లో వెళ్తున్నపుడు పక్కనే చెంబుతో మహిళలు నిలబడి ఉండటం చూస్తుంటాం. దూరంగా బస్సును చూసి, మధ్యలో లేచి నిలబడి బస్సువెళ్ళేవరకు ఆపుకుని నిలబడవలసి రావడం ఎంత దురదృష్టం! రైలు పట్టాల పక్కన రైలువెళ్ళే వరకు నిలబడి ఉండడం ఇంకెంత ఇబ్బందికరమైన దుస్థితి! ఇలాంటి పరిస్థితిలో కూడా నెహ్రూ, కృశ్చేవ్ పేర్లమీద అప్పట్లో ఓజోకు ప్రచారంలో ఉండేది.

భారతపర్యటనకు వచ్చి నప్పుడు నెహ్రూ, కృశ్చేవ్ మోర్నింగ్ వాక్‌కు వెళ్తున్నార, రోడ్డు పక్కనే కాలకృత్యాలు తీర్చుకుంటున్న కొందర్ని చూసి, కృశ్చేవ్ మీ దేశం ఇంకా చాల వెనుకబడి ఉంది' అన్నాడట. కొన్నాళ్ళు పోయాక, నెహ్రూ సోవియట్ యూనియన్ పర్యటనకు వెళ్ళినప్పుడు నెహ్రూ, కృశ్చేవ్ మోర్నింగ్ వాక్‌కు వెళ్ళేరట. అక్కడ ఓ రోడ్డు పక్కన కాలకృత్యాలు తీర్చుకుంటున్న వ్యక్తిని దూరం నుంచి చూసి దేశం కూడా బాగా వెనుకబడి ఉందే' అన్నారట నెహ్రూ దెబ్బకు దెబ్బ తీశానని ఆనందిస్తూ. అప్పుడు కృశ్చేవో కాస్త జాగ్రత్తగా చూడండి, అతను మీ దేశస్తుడే. ఇక్కడి కొచ్చినా పాత అలవాటు పోలేదు. అన్నాడట.

అప్పటినుంచి ఇప్పటి దాకా మరుగులేని దుస్థితి కొనసాగడానికి కారకులైన పాలకులపైజోకు వేసుకుందామా? మేకులు కొడదామా?

9.2.96, వార్త దినపత్రిక